


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

“సరే, నెలకి రెండొందల మార్కులే ఇద్దువుగాని. కానీ ప్రస్తుతం నేను డబ్బిబ్బందుల్లో ఉన్నాను. నాకో నూట యాభై మార్కులు అప్పుగా ఇవ్వగలవా? అప్పంటే అప్పు కాదు. డిసెంబర్ నెలకి అడ్వాన్సనుకో. పై నెలలో నువ్వు అద్దె ఇవ్వక్కర్లేదు” అందామె.

మారు మాట్లాడకుండా ఆమెకి నూటయాభై మార్కులిచ్చేశాను. దానికామె రసీదు కూడా ఇచ్చి, “ఎప్పుడొస్తారు మీవాళ్లు?” అంది. ఇప్పుడామెకి అదనపు ఆదాయం గురించి ఆత్రంగా ఉన్నట్లుంది.

కానీ నేను డబ్బు ఏర్పాటు చేసుకోవాలిగా! అదే ఆమెకి చెప్పి, “బహుశా ఫిబ్రవరిలోనో, మార్చిలోనో వస్తారు” అన్నాను.

“ఒంటరిగా ఉన్నావ్. వీలైనంత తొందరగా వాళ్లని తెచ్చుకో” అందామె కొంచెం జాలినీ, కొంచెం ఆశనీ మేళవించి.

నేను తలాడించి అక్కణ్ణించి కదలడంలో కాళ్లు తడబడి పడబోయి తమాయించుకున్నాను.

“కాళ్లు జాగ్రత్త! ఇండియాకి తిరిగొచ్చేక నడిచి ఏడు కొండలెక్కాలి” అని ఎవరో నా గొంతులో గొణిగినట్లయింది.

నేను దేవుడి గొంతు విన్నాను. మెదడులో రికార్డయిన ఆ గొంతుని టేపుమీదకి మార్చే సౌకర్యం లేకపోయింది కానీ – దేవుడి గొంతుని ఎందరికో వినిపించి ఉండేవాణ్ణి.

గదిలోకెళ్లి వెంటనే డబ్బు గురించి ఆలోచనలో పడ్డాను.

ప్రస్తుతం నా దగ్గర నిలవేసిన కొంత డబ్బుంది. అది నావాళ్ల టికెట్లకు సరిపోతుంది. కానీ ఆ టికెట్లు ఇండియాలో రూపాయలతో కూడా కొనొచ్చు. అలాంటప్పుడు – మనదికాని దేశంలో ఉంటూ ఇక్కడి కరెన్సీని వాడెయ్యడం సబబా అనిపించింది. చేతిలో ఎన్ని మార్కులుంటే అంత ధైర్యమిక్కడ!

ఇప్పుడు కనుక, ఇండియాలో ఎవరైనా ఈ విషయంలో నా అవసరానికి ఆదుకుంటే బాగుండుననిపించింది.

ఇక్కడికి డెప్యుటేషన్‌మీద వచ్చినవాణ్ణి. ఈ స్టయిపెండు కాక ఇండియాలో నాకొచ్చే జీతం అక్కడ రూపాయల్లో పేరుకుంటుంది. తిరిగి వెళ్లేసరికి సునాయాసంగా బాకీ తీర్చెయ్యగలను.

శ్రీమతివైపు బంధువుల్లో వేల రూపాయల్ని తృణప్రాయంగా చూడగలవారున్నారు. వాళ్లు తలో చెయ్యీ (వెయ్యీ) వేస్తే శ్రీమతి జర్మనీ ప్రయాణం క్షణాలమీద పని. ఇండియాకి తిరిగెళ్లాక, వాళ్ల డబ్బుని వడ్డీతో కలిపి పువ్వుల్లో పెట్టి ఇచ్చేయొచ్చు.

ఈ వివరాలన్నీ శ్రీమతికి ఉత్తరం వ్రాశాను. తననీ, పిల్లల్నీ ఇక్కడికి పంపడానికి మిగతా ఏర్పాట్లు చెయ్యమని కాకినాడలో మామగారికీ, కలకత్తాలో అన్నయ్యకీ కూడా వేరే ఉత్తరాలు వ్రాశాను.

అదయ్యేక మనసు కొంచెం తేలికపడింది. కానీ అంతలోనే ఏవో శంకలు.

నావాళ్లు ఇక్కడికొస్తే – ఇండియాలోలా సంతోషంగా మసలగలరా?

ఇక్కడి పద్ధతులు వేరు. ఇక్కడివాళ్ల ఆలోచనలు వేరు. ఒక సంప్రదాయ హిందూవనితగా నా భార్య ఇక్కడ ఇమడగలదా?

ఎందుకంటే ఇది మాకు తెలిసిన ప్రపంచం కాదు. మరో ప్రపంచం. ఆ విషయం మర్చిపోదామన్నా అహమ్మద్‌లాంటి మిత్రులు నన్ను మరువనివ్వరు......

మరో ప్రపంచం

ఇన్‌స్టిట్యూట్ ఫ్యూర్ టెక్నిషే షెమీ డైరెక్టర్ని – సంస్థలో చేరిన మొదటిరోజున కలవడమే. ఆతర్వాత ఈ రోజున ఆయన ఉపన్యాసముందని అహమ్మద్ చెబితే – ఎలా ఉంటుందో వినాలన్న కుతూహలంతో అతనితో కలిసి వెళ్లాను.

సెమినార్ హాలు ఇంగ్లీషు సినిమాల్లో చూసే వాటిలాగే ఉంది. ఉపన్యాసం జర్మన్ భాషలో. ప్రేక్షకులు, శ్రోతలు – మన దేశపు తీరులోనే కనిపించారు.

డైరెక్టర్ తన హయాంలో సాధించిన విజయాల గురించీ, ఇప్పుడు తనముందున్న లక్ష్యాల గురించీ ఏకరువు పెడుతుంటే – 'కొయ్' అన్న రీతిలో కొందరు నవ్వుకున్నారు.

నా పక్కనున్న కొందరు ఆ చుట్టుపక్కల మాత్రమే వినపడే స్వరాలతో జోక్సు కూడా వేశారు.

స్లయిడ్ షో ఆ ఉపన్యాసంలో భాగం. ప్రొజెక్టరు ఆపరేట్ చేస్తున్న వ్యక్తి నాకు దగ్గర్లోనే ఉన్నాడు. అతనిమీద కూడా చాలా జోకులు పడ్డాయి. అతనూ నవ్వుతున్నాడు.

నా పక్కనున్న ఒకతను బొమ్మలు గీస్తున్నాడు. డైరెక్టర్ని కార్టూన్ రూపంలో చిత్రించాడతను.

నాకు చిన్నప్పటి క్లాస్‌రూం గుర్తొచ్చింది. అప్పటిలాగే ఈ వాతావరణమూ ఆహ్లాదకరంగా ఉంది.

వేగంగా జర్మన్లో కొనసాగుతుండడంవల్లనూ, పూర్తిగా టెక్నికల్ లాంగ్వేజి కావడం వల్లనూ – ఆ భాష నాకు అంతగా అర్థం కాలేదు. సబ్జక్టు కూడా నాకు సంబంధించింది కాదు. ఐనా కాసేపు కూర్చున్నాను.

వాతావరణం తేలికగా ఉందని అనుకున్నాను కానీ ఉపన్యాసాన్ని ఎవరూ తేలికగా తీసుకున్నట్లు లేదు. ఇరవై ఏళ్ల యువకులు కూడా శ్రద్ధగా విని, లేచి నిలబడి విమర్శనాత్మకమైన సందేహాల్ని ధైర్యంగా అడుగుతున్నారు. వాళ్లకి తగిన సమాధానాలు లభిస్తున్నాయి.

ఇండియాలో మా లాబొరెటరీలో డైరెక్టర్ సెమినార్ ఇస్తే – దానికి అంతా వెళి వెళ్లితీరాలి. ఆయనేం చెప్పినా తలూపుతూ వినాలి. ఎవరైనా లేచి నిలబడితే, ఆయన చెప్పిన పాయింటుని అభినందించడానికి మాత్రమే! అలాకాక సందేహమేదైనా వెలిబుచ్చితే, తప్పు చేస్తున్నట్లు మొహంపెట్టి అడగాలి. దేనికైనా డైరెక్టరిచ్చే సమాధానం – సద్గురువు శిష్యులకు చేసే జ్ఞానప్రబోధంలా ఉంటుంది.

ఇక్కడ అడిగేవాళ్లలో అచ్చమైన కుతూహలమే తప్ప వినయం లేదు. బదులిచ్చేవారిలో తన ఉద్దేశ్యం వివరించాలన్న తాపత్రయమే తప్ప అహం లేదు.

ఇది మాత్రం మన పద్ధతి కాదు. నాకిక్కడి తీరు నచ్చింది.

కాసేపయ్యేక హాల్లోంచి బయటకొచ్చాను. నాతోపాటే అహమ్మద్ కూడా బయటకొచ్చాడు. నావైపు అదోలా చూస్తూ, "ఏమిటలా దిగులుగా ఉన్నావ్?" అన్నాడు.

నిజానికి నేనప్పుడు దిగులుగా లేను. కానీ ఉన్నానని అహమ్మద్ అనుమానం.

జర్మనీలోని వైభవ విలాస జీవితపు గొప్పతనాన్ని నేను ఏదో రోజున గుర్తిస్తాననీ, అపురూపమైన కాలాన్ని అన్నాళ్లు వృథా చేసినందుకు తప్పక పశ్చాత్తాపపడతాననీ అతనికి గట్టి నమ్మకం.

"లేదే, నేను చాలా సంతోషంగా ఉన్నాను" అన్నాను.

అహమ్మద్ తల అడ్డంగా ఊపి, "నువ్వు సంతోషంగా ఎలా ఉంటావు? అందుకు ముందు సంతోషమంటే ఏమిటో తెలియాలిగా!" అని నాకో చురక వేశాడు.

అవతలివ్యక్తి మనకంటే అధికుడు కాదన్న నమ్మకమున్నప్పుడు అలాంటి చురకలకు చిన్నతనముండదు. నేను నొచ్చుకోకుండా, "సంతోషమంటే నీకు తెలుసా?" అన్నాను.

"అది చెప్పేముందు నిన్నొకటడగాలి. ఆడదాని తొడలమధ్య ఏముంటుందో తెలుసా?" అన్నాడు అహమ్మద్. మాట ఎంత పచ్చిగా ఉందో, అంత కసీ ఉంది గొంతులో.

ఏం చెబుతాను? తనేమంటాడోనని, “నీకు తెలుసా?” అన్నాను.

“తెలియడమేమిటి? అది నా ఆరాధ్యరూపం. నా రూంకొస్తే చూపిస్తాను – నా ఆరాధ్యరూపం నిలువెత్తు పటాన్ని. నా ప్రియురాల్ని ఒప్పించి క్లోజప్పులో ఫొటో తీసి ఎన్‌లార్జి చేయించి పెట్టుకున్నాను” అన్నాడు.

ఇలా మాట్లాడ్డం అహమ్మద్‌కి అలవాటే. అతడి అభిరుచికి తగిన మాటలవి.

ఇండియాలో ఐతే ఆ మాటల్ని నిరసించడమో, మందలించడమో చేసేవాణ్ణి. అతడి మాటల్ని చేతల్లోకి మార్చి చూపే పచ్చి నీలి చిత్రాల్ని ప్రతిరోజూ పదిమంది మసిలేచోట థియేటర్లలో ఆగకుండా ప్రదర్శించడం అత్యంత సాధారణమైన పరిసరాల్లో ఉన్నాను.

నా వ్యక్తిగత వ్యవహారాల్లోకి చొరబడనంత కాలం ఇక్కడ ఇలాంటివి ఎబ్బెట్టుగా ఉన్నా విని సహించడం తప్పనిసరి.

నేను నవ్వి, “నీలో కసి ఎక్కువ” అన్నాను.

“మగాడికి కసి ఉండాలి. నా కసి నా ప్రియురాలి కెంతిష్టమో మాటల్లో చెప్పలేను. అంతెందుకూ, ఓ జర్మన్ మహిళ ఉంది. ఆమె వివాహిత. కానీ తరచుగా నా దగ్గరకొస్తూంటుంది. భర్త దగ్గర దొరకని సుఖం నా దగ్గర లభిస్తుందని తెగ మెచ్చుకుంటుంది” అన్నాడు అహమ్మద్ గర్వంగా.

అహమ్మద్‌కి మగాడిగా తన సామర్థ్యం గురించి చెప్పుకోవాలని మహా కోరిక. తనకెందరో గర్ల్‌ఫ్రెండ్సున్నారనీ, వాళ్లు తరచుగా తనకి కసి నిండిన ఉత్తరాలు రాస్తుంటారనీ నాకు చెబుతుండేవాడు.

కాళీ గిన్నెలకి సౌద ఎక్కువని ఓ ఇంగ్లీషు సామెత. అహమ్మద్ కబుర్లు సీరియస్‌గా తీసుకునేవాణ్ణి కాదు నేను. అతను చెప్పేదాంట్లో నిజం చాలా తక్కువని నాకు అనిపించేది.

“స్నేహంలో కసి కాదు, అభిమానముండాలి. ఏకాంతంలో రెచ్చిపోయినప్పుడెలాగూ కసికే ప్రాధాన్యం ఉండొచ్చు. మరి ఉత్తరాల్లోనైనా చూపకపోతే అభిమానాన్ని ప్రదర్శించే అవకాశం ఇంకెప్పుడొస్తుంది?” అన్నాను.

“ఆడా మగా మధ్య శారీరక సంబంధమే అభిమానం! వేరే అభిమానమేమిటో నాకర్థం కాదు” అన్నాడు అహమ్మద్.

“అర్థమయ్యేలా నీకో ఉదాహరణ చెబుతాను” అంటూ అతనికి ల్యూనబర్గ్‌లో పరిచయమైన క్రిస్టాలూథర్ గురించి చెప్పాను. నేను బెర్లిన్ వచ్చేక కూడా ఆమెకీ నాకూ మధ్య ఉత్తరాలు నడుస్తున్న విషయం చెప్పాను. జర్మన్ భాషలో నా భావ ప్రకటన చాలా బాగుందనీ, నేనొక అద్భుతమైన లేఖకుడిననీ పొగిడేదామె. ప్రతీదీ అద్భుతమనడం అక్కడి మర్యాద కాబట్టి, నేనామె పొగడ్తలకి ఆనందించినా, అవి నిజమని భ్రమ పడలేదు.

అహమ్మద్ నేను చెప్పిందంతా కుతూహలంగా, శ్రద్ధగా విన్నాడు. “అర్థం కాలేదా? ఆమె నిన్ను కోరుతోంది” అన్నాడు. అని ఆగలేదు. మా ఇద్దరిగురించీ అసభ్యంగా మాట్లాడ్డం మొదలెట్టాడు.

అతన్ని ఆపాల్సిన సమయమొచ్చిందని గ్రహించాను. “బాబూ, నీకో నమస్కారం. మా ఇండియన్సుకి కొన్ని సెంటిమెంట్సున్నాయి. అభిమానించేవారి గురించి అలా మాట్లాడ్డం – మా ఇంటి ఆడవాళ్లని అవమానించినంత బాధని కలిగిస్తుంది” అని మందలించాను.

ఏమనుకున్నాడో అహమ్మద్ ఆ విషయమక్కడితో ఆపేశాడు. “ఇరాక్‌లో ఇండియన్ సినిమాలు చాలా చూశాను. మీ హీరోయిన్స్ చాలా బాగుంటారు. హీరో, హీరోయిన్స్ చెట్టాపట్టాలేసుకుని పాటలు పాడుతూ డ్యాన్సులు చేస్తారు. నాకవి చూడ్డానికి బాగుంటాయి. కానీ ఎంత దగ్గరగా వచ్చినా కూడా వాళ్లు ముద్దు మాత్రం పెట్టుకోరు. ఎందుకని?” అంటూ టాపిక్ మార్చాడు.

“ముద్దులు మా దేశంలో నాలుగు గోడలకే పరిమితం. నాలుగు గోడల మధ్య చేసే ప్రతి పనీ బహిరంగంగా చెయ్యొచ్చునంటే – మనకిక మరుగుదొడ్ల అవసరముండదు” అన్నాను.

నేను పరోక్షంగా సున్నితంగా చెప్పినా, అహమ్మద్‌కి అర్థమయింది. అతడు వెంటనే, "అది సరే రావ్! ఇక్కడ నువ్వింకా చాలా కాలముండాలి. ఆడవాళ్ళని తాకకుండా ఎన్నాళ్ళుండగలవ్?" అంటూ మళ్లీ మాట మార్చాడు.

"ఇంకా నీకు చెప్పలేదు కదూ! తొందరలోనే నా భార్య ఇక్కడికి రానున్నది" అన్నాను.

"వ్వాస్! (వాట్)" అన్నాడు అహమ్మద్ అప్రయత్నంగా. అతని ముఖంలో అపనమ్మకం.

నమ్మకం పుట్టడానికి అతనికి అంతవరకూ నేనా విషయమై చేసిన ప్రయత్నాలన్నీ వివరంగా చెప్పాను.

అంతా విని, "అంటే, నువ్వు నీ భార్యనిక్కడికి రప్పించుకుందుకు మూడువేల మార్కులు ఖర్చు పెట్టదల్చుకున్నావన్నమాట!" అన్నాడు అహమ్మద్.

"ఊఁ"

ఉన్నట్లుండి అహమ్మద్ ముఖంలో గీతోపదేశం చేసే కృష్ణుడు కనిపించాడు.

"డాక్టర్ రావ్! యాభై మార్కులిస్తే నీకిక్కడ అప్సరసల్లాంటి అమ్మాయిలు దొరుకుతారు. నెలకో పదిమందిని లెక్కేసుకున్నా – మూడొందల మార్కులంటే – ఆరు నెలలపాటు నీకు వెరైటీకి వెరైటీ, సౌఖ్యానికి సౌఖ్యం. నా మాట విని నీ నిర్ణయం మార్చుకో. ఈ విషయంలో నీకు నేను సాయపడతాను" అన్నాడు.

తెల్లబోయాను. భార్య విషయంలో ఇలాంటి లెక్క ఒకటి ఉంటుందని పొరపాటున కూడా స్ఫురించని నాకు ఆ మాటలు వినగానే కొంత జుగుప్స కూడా కలిగింది.

భార్యాత్వాన్ని సంగమానికి మాత్రమే ఆపాదించి, ప్రతి సంగమానికీ వెల కడుతున్నాడతను. నిజంగా ఆడవాళ్లు ఈ రీతిలో ఆలోచించడం మొదలెడితే – వరకట్నం మాట అటుంచి – మగాళ్లకి పెళ్లి అనేది గొంతెమ్మకోరికగా మారిపోదూ?

దూరాన్నుంచి మా సంభాషణలో కొంత డెకర్ట్ చెవులబడినట్లుంది. అతడు చకచకా నావద్దకొచ్చి, "నీ భార్య ఇక్కడికొచ్చే పక్షంలో, ఆమ్‌స్టర్‌డామ్ రూట్లో రమ్మను. నేను, నా శ్రీమతి, నువ్వు కలిసి వెళ్లి ఆమెను రిసీవ్ చేసుకుని బెర్లిన్‌కి తీసుకొద్దాం" అన్నాడు ఎంతో అభిమానంగా.

ఆమ్‌స్టర్‌డామ్ బెర్లిన్‌కి దూరమే. కార్లో వెళ్లి రావాలంటే కొన్ని వందల మార్కులౌతుంది.

అతడి ఆఫర్‌కి ఆశ్చర్యపడుతూనే, "అబ్బే, నీకెందుకూ శ్రమ?" అన్నాను మొహమాటంగా.

"ఇందులో శ్రమేముంది? టూర్లు మాకిష్టం. ఆమ్‌స్టర్‌డామ్ చాలా బాగుంటుంది. ఎలాగూ వెళ్లాలనుకుంటున్నాం. మాతోపాటు మీరూ ఊరు కూడా చూడొచ్చు" అన్నాడు డెకర్ట్.

జర్మన్సులో ఉన్న విశేషమిదే. ఏ మాటైనా సూటిగా చెబుతారు. అభిమానమూ సూటిగానే ఉంటుంది.

"నీ ఆఫర్ ఉపయోగించుకోగలనో లేదో తెలియదు. నీ అభిమానం మాత్రం కలకాలం గుర్తుండిపోతుంది" అన్నాను.

అతని అభిమానానికి కారణం అతని మంచి మనసు కావచ్చు. నా స్నేహశీలత కూడా కావచ్చు. అదక్కడ సాధారణమూ కావచ్చు. నేనా విషయమై ఎక్కువ ఆలోచించలేదు.

ఆ రోజు సాయంత్రమే అహమ్మద్ నా దగ్గరకొచ్చి, "ఈ రోజు బీర్ దొరుకుతుంది రావ్!" అన్నాడు.

"బీర్ దొరకడమేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

పార్టీ జరుగుతోందనడానికి వాడుక పదం బీరు దొరకడమని అప్పుడు నాకు తెలిసింది.

ఆ రోజే మా ఆఫీసులో మ్యుల్లర్‌కీ, మరో ముగ్గురికీ స్కాలర్‌షిప్పులు లభించాయి. వాళ్లు పార్టీ ఇస్తున్నారు.

అలాంటి పార్టీకి ప్రత్యేకంగా ఆహ్వానముండదు. నోటీసు బోర్డులో పెడతారంతే!

ఆ పార్టీ చిత్రంగా ఉంది. నోటీస్ బోర్డులో చూసి పార్టీ జరిగే స్థలానికి వెళ్లడం – అంతే!

అక్కడ పార్టీ ఇచ్చేదెవరో, పుచ్చుకునేదెవరో తెలియదు. ఎవరికి కావాల్సింది వారు తీసుకుని తినడమూ, తాగడమూ, వెళ్లిపోవడమూ! అతిథులుగా వచ్చినవారికి ‘బీరు దాతా! వైను దాతా! సుఖీభవ’ అనే అవకాశం కూడా లేదు.

ఈ పద్ధతి ముందు నాకు నచ్చలేదు. కానీ పార్టీలో నాకోసం కొన్ని శాకాహార పదార్థాలుంచడం గమనించి ఆశ్చర్యపడ్డాను. అంటే పార్టీ ఏర్పాటు చేసినప్పుడు నన్ను కూడా దృష్టిలో ఉంచుకున్నారన్నమాట! అంటే పార్టీ ఇవ్వడం వెనుక చాలా ఆలోచన ఉన్నట్లే కదా! దాంతో నా అభిప్రాయం మార్చుకున్నాను.

ఈ పార్టీకి వెళ్లేముందే కిర్‌ష్నర్ అనే యువకుడు పరిచయమయ్యాడు. అతను పార్టీ కోసం మైదాపిండిని బీరుతో పులవబెట్టి ఓవెన్లో ఉడకబెట్టి స్వయంగా ఓ కొత్త వంటకం చేశాడు. అది ఇటాలియన్ డిష్ అనీ, పిట్జా అంటారనీ చెప్పాడు.

పార్టీకి వచ్చినప్పుడు – నాకోసం పిట్జాలో కొంత భాగాన్ని ప్రత్యేకంగా శాకాహారంగా చేశానని అతను నాకు చెప్పాడు. ఆసక్తి లేకపోయినా మొహమాటానికి కొద్దిగా రుచి చూశాను. నచ్చలేదు. మర్యాదకి బాగుందని చెప్పాను కానీ మరి తినలేదు.

అంతా వైన్ తీసుకుంటుంటే నేను నారింజరసం తీసుకంటున్నందుకు నామీద కొన్ని జోక్సు పడ్డాయి. చివరికి రాలెక్ కూడా, “ఏ కోరికలూ లేకుండా, ఎలా బ్రతుకుదామనుకుంటున్నారండీ మీరు?” అని అవహేళనని జాలిగా ప్రదర్శించాడు.

సాధారణంగా రాలెక్ నామీద జోక్స్ వేసేవాడు కాదు. ఆయన సహజ గంభీరుడు. కానీ తాగిన మత్తులో గాంభీర్యం తొలగిపోవడం సహజమే కదా!

అంతమంది మత్తు మనుషులమధ్య నేనొక్కణ్ణీ తాగకుండా అందరి జోక్సూ మౌనంగా భరిస్తూ చాలాసేపే కూర్చున్నాను.

నాకు నా అలవాట్లమీద చిన్నచూపు లేదు. వాటినే నా స్నేహితులుగా భావిస్తాను. కానీ నేనిప్పుడు నీటబాసిన కమలాన్ని. నా మిత్రులే శత్రులు కావచ్చు.

ఇలాంటి పరిస్థితికి తట్టుకోలేకే చాలామంది ఇండియన్స్ ఇక్కడికొచ్చి తమ అలవాట్లని మార్చుకుని ఉండొచ్చని అప్పుడనిపించింది.

మందు పార్టీలకు ఆరంభమే కానీ అంతముండదు. అందుకని నేనక్కణ్ణించి కాస్త ముందుగానే ఆఫీసొదిలాను. తర్వాత మార్కెట్లో తిరుగుతుంటే, అక్కడ ఉన్నట్లుండి ఓ అపరిచిత జర్మన్ వ్యక్తి నన్ను ప్రత్యేకంగా పలకరించాడు. నా వివరాలడిగి తెలుసుకుని, “అరే, నువ్వు రాలెక్ దగ్గర పని చేస్తున్నావా? ఆయన నాకు బాగా తెలుసు” అన్నాడు.

నాకు సంభాషణ పెంచడం ఇష్టం లేదు. అనాసక్తంగా “అలాగా” అని ఊరుకున్నాను.

“రాలెక్ చాలా గొప్ప ఇంజనీరు. నాకు చిన్నప్పట్నించీ తెలుసు” అన్నాడతను.

“మీరు ఏ రాలెక్ గురించి చెబుతున్నారో నాకు తెలియదు. ఈ రాలెక్ గతంలో చెకోస్లేవేకియా దేశస్థుడు. చిన్నప్పుడు జర్మనీలో లేడు. ఐనా తను ఇంజనీరు కాదు. కెమిస్ట్రీ డిపార్టుమెంట్. త్వరలో ప్రొఫెసరవతాడు” అన్నాను.

“అదే అదే, ఆ రాలెక్కే” అంటూ అతను తడబడి, “నీకు పెళ్లయిందా?” అన్నాడు.

ఈ ప్రశ్నకి నాలో లక్ష అనుమానాలు. “ఎందుకు?” అన్నాను ప్రశ్నకి బదులివ్వకుండా.

“నువ్వు చూడ్డానికి బాగున్నావు. బాగా చదువుకున్నావు. మంచి పొజిషన్లో ఉన్నావు. ఇక్కడే పెళ్లి చేసుకుని స్థిరపడ్డావంటే, నీ పని ఇంకా చాలా బాగుంటుంది. నాకు తెలిసిన మంచి జర్మన్ పిల్లలున్నారు. చాలా అందగత్తెలు. బుద్ధిమంతులు. నువ్వు ఊఁ అంటే ఎవరో ఒకరితో పెళ్లి ఏర్పాట్లు చేస్తాను” అన్నాడా వ్యక్తి.

ఊహించని ఈ ప్రపోజల్‌కి తెల్లబోయాను. వెంటనే త్రుంచెయ్యాలని, "సారీ, నాకు పెళ్ళయింది" అన్నాను.

"నేను నమ్మను" అన్నాడతను వెంటనే.

"ఎందుకని?'

"ఇరవై నిండకుండా ఎవరైనా పెళ్లి చేసుకుంటారా?" అన్నాడతను.

"ఇరవై నిండనిదెవరికి, నాకా?" అన్నాను. అతను ఊఁ అనగానే, "మరి మీరు నాకెందుకు ప్రపోజ్ చేస్తున్నారు?" అన్నాను.

"ఇండియాకి తిరిగి వెళ్లిపోతావని భయపడి" అన్నాడతను.

"ఇండియాకి ఎలాగూ తిరిగెల్లాలి. అక్కడ నా భార్య ఉంది కాబట్టి. నా వయసు కూడా ఇరవై కాదు. ముప్పై దాటాయి" అన్నాను.

"అన్నీ అబద్ధాలే" అని నవ్వేశాడతను.

"నమ్మడం నమ్మకపోవడం మీ ఇష్టం. నాకు పెళ్లవడమే కాదు, ఇద్దరు పిల్లలున్నారు. నా గదికొస్తే నా ఫామిలీ ఫొటో చూపిస్తాను" అన్నాను సీరియస్‌గా.

క్షణంపాటు ఆలోచనలో పడిన అతను ఆ వెంటనే నవ్వేశాడు. "అయినా ఫర్వాలేదులే, ఇండియన్ ఆడవాళ్లు వంటింటి కుందేళ్లు. మగాణ్ణి ఎలా అలరించాలో జర్మన్ వనితలకి తెలిసినట్లుగా మరెవ్వరికీ తెలియదు. సుఖపడాలంటే జర్మన్ వనితను పెళ్లాడాలి. నీకు ఇప్పటికే పెళ్లయితే కనుక నీ భార్యకి విడాకులిచ్చేసేయ్" అన్నాడు.

పెళ్లికి ఇలా కూడా ప్రపోజ్ చేసేవారుంటారని నేనూహించలేదు. అంతమాత్రాన అతను జర్మన్ పెళ్లిళ్ల పేరయ్యలకు ప్రతినిధిగానూ భావించలేదు. తిక్క మనిషో, లేక కాలక్షేపానికి నన్నెన్నుకున్నాడో అనుకున్నాను. '

అలాగని మౌనంగా ఊరుకోలేను కదా, "నా భార్య చాలా అందంగా ఉంటుంది. ఆమె విషయమై నాకు అసంతృప్తి లేదు. మేము ఎంత సంతోషంగా ఉన్నామంటే, జీవితాంతం కలిసే ఉంటాం తప్ప విడాకుల మాట కలలో కూడా అనుకోలేం" అన్నాను.

అతను నాకు నచ్చజెప్పడానికి కాసేపు ఏమేమో చెప్పాడు. చివరి ప్రయత్నంగా, "సరే, నీ భార్యకి విడాకులివ్వద్దు. నువ్విక్కడింకా ఏడాదుంటావుగా! అందాకా ఇక్కడో అమ్మాయిని పెళ్లి చేసుకుని, వెళ్లేముందు విడాకులిచ్చి వెళ్లిపో! ఎలాగుంది నా ఐడియా?" అన్నాడు.

అతనెవరో నాకు తెలియదు. ఉద్దేశ్యం నాకు తెలియదు. అతనితో మాటలు పెంచి లాభం లేదని గ్రహించి, "సారీ!" అని ఒకే ఒక ముక్క అని అక్కణ్ణించి ఇంచుమించుగా పారిపోయాను.

ఇల్లు చేరాక ఆలోచిస్తుంటే – సంప్రదాయంగా ఉండేవారికి ఇది చాలా ప్రమాదకరమైన దేశం కాదు కదా అని భయమేసింది. అందుకు కారణం కొంతవరకూ గోపాలకృష్ణన్. నాకంటే ఎక్కువ స్టయిపెండ్ వస్తున్న అతను – భార్యని ఇక్కడికి రప్పించుకుందుకు వెనుకాడాడంటే – అదే వివేకమేమో!

అప్పుడు నా మనసు నాపై జాలిపడింది. ఆ జాలి రాలెక్ నాపై చూపిందానికంటే ఎక్కువగా ఉంది.

ఇక్కడికొచ్చి ఐదు నెలలవుతోంది. ఇంతవరకూ నాకిక్కడ చిన్న ఇబ్బందైనా కలిగిందా?

జర్మన్ భాష నేర్చుకున్నాను. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాను. ఇల్లు కావాలంటే ఇల్లు దొరికింది. ఏ సాయం కావాలంటే ఆ సాయం చెయ్యడానికి ఇష్టపడి ముందుకొచ్చే ఇండియన్, జర్మన్ మిత్రులు దొరికారు. లాబొరేటరీలో సదుపాయాలే కాదు, వాతావరణం కూడా బాగుంది. ఏడాది తర్వాత ఇక్కణ్ణించి వెనక్కి వెడితే మళ్లీ నా ఉద్యోగం నేను చేసుకోవచ్చు.

ఇక్కడ నా ధనప్రాణాలకు పూర్తి రక్షణ ఉంది. ఇక్కణ్ణించి వెళ్లేక ఇండియాలో నా జీవితం మరింత ఉత్సాహభరితమౌతుంది.

చీటికీ మాటికీ నేనెందుకు భయపడుతున్నట్లు?

మనం ఎన్నుకునే మనుషుల్ని బట్టి మనకి లభించే ప్రేరణ ఉంటుంది. నేను గోపాలకృష్ణన్‌కి బదులు దాస్‌ని ప్రేరణగా తీసుకుంటే!

సాహసవీరుడు దాస్

ఓం ప్రకాష్ మహాపాత్రా ద్వారా నాకు పరిచయమయ్యాడు దాస్. స్వరాష్ట్రం కేరళ. అక్కడ ఏదో కంపెనీలో సేల్స్ ఇంజనీరుగా పని చేస్తూ ఆ జీవితం విసుగుపుట్టి ఓ చార్టర్డ్ ఫ్లయిట్లో జర్మనీకి వచ్చి చేరాడు.

మన దేశంలోని చార్టర్డ్ ఫ్లయిట్సు వ్యవస్థ గురించి నాకప్పుడే తెలిసింది. ఆ ఫ్లయిట్సులో ప్రయాణానికి పాస్‌పోర్ట్ ఉంటే చాలు. రానూపోనూ టికెట్ తీసుకుని ఏ దేశానికైనా వెళ్ళి ఉండొచ్చు. ఆ టికెట్ గడువుకాలం మూడు నెలలు. గడువైపోగానే స్వదేశానికి తిరిగి వెళ్ళిపోవాలి.

దాస్‌కి సీదాసాదా రొటీన్ జీవితం నచ్చదు. లైఫ్‌లో ఏదైనా అడ్వెంచరుండాలంటాడు. అందుకని నాలుగువేల ఐదొందల రూపాయలు పెట్టి బెర్లిన్‌కి రానూపోనూ టికెట్ కొన్నాడు. బెర్లిన్ చేరుకున్నాక తిరుగు ప్రయాణపు టికెట్‌ని వేరెవరికో అమ్మేశాడు. అలా చాలామంది చేస్తుంటారుట.

దాస్ బెర్లిన్లో దిగేక ముందు ఏదైనా యూనివర్సిటీలో చేరి పై చదువులు చదవాలనుకున్నాడు. అందుకు ముందుగా జర్మన్ భాష నేర్చుకోవడం అవసరమని తెలిసి, అక్కడ జర్మన్ లాంగ్వేజి కోర్సులో చేరాడు.

జర్మన్లు మనలా కాదు. వారికి భాషాభిమానం ఎక్కువ. తమ భాష ప్రపంచవ్యాప్తి చెందాలన్న వారి తపన ఆదర్శప్రాయం.

భాష నేర్చుకుందుకుగానూ దాస్‌కి మూడు నెల్లపాటు ఆ దేశంలో ఉండడానికి అనుమతి లభించింది. అనుమతి ఐతే దొరికింది కానీ, అక్కడ రోజులు గడిచేదెలా?

దాస్ బెర్లిన్లో ఉద్యోగ ప్రయత్నాలు ఆరంభించాడు. కానీ భాష నేర్చుకునే విద్యార్థులు ఉద్యోగం చెయ్యకూడదన్న నిబంధన ఉందక్కడ. అదెంత ఖచ్చితమంటే, అలా చేసినవారు జైలుకెళ్ళాల్సి రావచ్చు.

నియమాలూ, నిబంధనలూ పట్ల మన దేశంలో ఉన్న అవగాహనే వేరు. అవి పేరుకి మాత్రమే అని విద్యావంతులు కూడా భావించే దేశం మనది. ఇండియానుంచి వచ్చిన దాస్ అదే మనస్తత్వంతో, ఈ విషయమై జర్మనీలోనూ ఏదో అడ్డదారి దొరక్కపోదని గట్టిగా నమ్మాడు.

నమ్మికతో ప్రయత్నిస్తే ఎంతటి పకడ్బందీ వ్యవస్థలోనూ లొసుగులుంటాయి. ఎన్ని పాశ్చాత్యదేశాల్లో అక్రమ వలసదారులు లేరు?

దాస్‌కి జర్మనీలో ప్రయివేట్ సంస్థలు అక్కరకొచ్చాయి. మామూలుగాకంటే తక్కువ జీతానికొప్పుకుని, రహస్యంగా అతను చేసిన ఉద్యోగాల్లో – టాయిలెట్ క్లీనింగు ఒకటి. అతను ఏంచేస్తున్నానని ఆలోచించలేదు. జీతమెంతా అని చూసుకున్నాడు. అది అవసరానికి మించే వస్తోందని ఉత్సాహపడ్డాడు.

ఉద్యోగమూ, సంపాదనా మాత్రమే ప్రధానమైతే దాస్ ఇండియాలోనే ఉండేవాడు. అక్కడ చదవడంలో పస లేదనీ, జర్మనీలాంటి దేశంలో చదవాలనీ అతనికి మనసు. జర్మన్ లాంగ్వేజ్ కోర్సులో ప్యాసైతే, అతనికి చదువుకుంటూనే ఉద్యోగం చెయ్యడానికి అనుమతి లభిస్తుంది. కానీ దురదృష్టం – ఇంతవరకూ రెండుసార్లు పరీక్షకు కూర్చుని,రెండుసార్లూ తప్పాడు. మళ్లీ కూర్చుంటే ప్యాసౌతానా అన్న బెంగ అతనికుంది.

దాస్‌కి జర్మనీ నచ్చింది. అలాంటిచోటనే స్థిరపడాలని మనసౌతోంది. అందుకని తన వంతు ప్రయత్నాలు చేస్తున్నాడు.

లాంగ్వేజ్ కోర్సు ప్యాసయ్యాక అక్కడుండి చదువుకునేందుకు అనుమతి లభిస్తుంది. కానీ చదువుకి డబ్బు బాగా ఖర్చవుతుంది. చిన్న ఉద్యోగంమీద వచ్చే ఆదాయం చదువుకు సరిపోకపోవచ్చు. కాబట్టి ఎప్పటికప్పుడు ఎలాగో అలా వీలైనంత సంపాదించి డబ్బు బాగా కూడబెట్టి

దగ్గరుంచుకోవాలనుకున్నాడు. అందుకని ఒకటికి మించి ఉద్యోగాలు చెయ్యాలనుకున్నాడు. ఆ ఉద్యోగాల వేటలో ఇటీవలే పేపర్‌బాయ్ ఉద్యోగం దొరికింది.

దాస్ రోజూ తెల్లవారు ఝామున మూడున్నరకి లేచి ఆ ఉద్యోగానికి వెడతాడు. దినపత్రికల్ని ఓ ట్రాలీలో ఉంచి, దాన్ని తోసుకుంటూ ఇంటింటికీ వెళ్లి, ఇంటిముందుండే లెటర్ బాక్సులో పత్రిక ఉంచాలి. ఆ విధంగా అతను పత్రిక ఇవ్వాల్సిన ఇళ్లు రోజుకి మూడొందలు. మూడున్నరకి మొదలెడితే గంటన్నరలో అంటే ఐదు లోగా ఆ పని ఐపోతుంది. ఒక పత్రికకి పది ఫెన్నిగ్సు కమిషన్‌గా వస్తుంది. అంటే రోజుకి ముప్పై మార్కులు. మన దేశంలో కూలితో పోలిస్తే – అతను పడే శ్రమకి ఆ ప్రతిఫలం బాగా ఎక్కువే.

ఎటొచ్చీ ఈ పనిలో దాస్‌కో ఇబ్బందుంది. అతను పత్రికలు పంచే వేళలో కాపలా పోలీసులు తిరుగుతుంటారు. వారి కంటపడితే, వాళ్లతన్ని ఐడెంటిటీ కార్డు చూపమంటారు. దాస్ విదేశీయుడు కాబట్టి పాస్‌పోర్ట్ చూపాలి. పాస్‌పోర్టులో అతనికి రెసిడెన్స్ పెర్మిట్ లేదు. అది లేకుండా ఉద్యోగం చెయ్యడం నేరం. జైలు శిక్ష పడుతుంది.

పోలీసుల కంటపడకుండా తప్పించుకుంటూ రెండు మూడు నెలలుగా ఈ ఉద్యోగం చేస్తున్నాడు దాస్. కొంత డబ్బు కూడబెట్టగలగడం వల్ల తృప్తి. సాహసము చేయరా డింభకా అన్న మనసుకి సంతృప్తి. దాస్ సంతోషంగానే ఉంటున్నాడు.

అందుకు కారణం అతడి మనస్తత్వం మాత్రమే కాదు – అతడుంటున్న హాస్టలు కూడా!

బెర్లిన్లో హాస్టల్ ముచ్చట్లు

బెర్లిన్‌లో లియోపాల్డ్ ప్లాట్జ్ అనే ప్రాంతంలో ఒక హాస్టలుంది. అందులోనే గుప్తా ఉంటున్నాడు. ఓం ప్రకాష్ కూడా అందులోనే ఉంటున్నాడు. అతినికోసం గోపాలకృష్ణన్ కూడా అందులోకి మారాడు. దాస్ ఉండేదీ అక్కడే కానీ, అక్కడ అతని ఉనికి అజ్ఞాతం.

ఆ హాస్టల్లో ఉన్నవాళ్లలో చాలామంది ఇండియన్స్. అంతా వివిధ ప్రాంతాలకు చెందినవారైనా అందరిమధ్యా ఎంతో సంఘీభావముంది. అక్కడే నేనో విషయం గ్రహించాను – దేశపుటెల్లలు దాటేక ఒకరినొకరు కలుసుకున్నప్పుడు భారతీయుల్లో ప్రాంతీయ వ్యతిరేక భావాలు తొలగిపోయి మనం భారతీయులం అనే జాతీయభావం నెలకొనే అవకాశముంటుందని.

ఆ హాస్టల్లోనూ ఒక రావ్ ఉన్నాడు. అతను కన్నడిగుడు. తెలుగు మాట్లాడ్డం బాగా వచ్చు. తెలుగు బాగా వచ్చిన మరో కన్నడిగుడు నాని కూడా అక్కడే ఉంటున్నాడు. అతని అసలు పేరేమిటో కానీ అంతా నాని అంటారు. దాస్ వీళ్ల రూంలో ఉంటున్నాడు.

హాస్టల్‌కి అతిథులు వస్తూపోతూండొచ్చు. కానీ అక్కడే ఉండిపోకూడదు. అలా ఉండిపోతే హాస్టల్ వార్డెన్ పట్టుకుంటాడు. అతను ప్రతి రోజూ రాత్రిళ్లు ప్రతి గదినీ తనిఖీ చేసి వెడుతుంటాడు. అతని కళ్లు కప్పి అక్కడుండడం అంత సులభం కాదు.

సాహసవీరుడు దాస్ అలాగే అక్కడ కొనసాగుతున్నాడంటే, అందుకు ఇండియన్ మిత్రుల సంఘీభావమే కారణం. వాళ్లు దాస్‌కి ఆసరా ఇవ్వడానికి అడుగెత్తుండే పెద్ద పరుపునొకదాన్ని సంపాదించి గదికి తెచ్చారు. అదెలాగంటే –

పాశ్చాత్యదేశాల్లో పాత సామాన్లు అమ్మడం అరుదు. అలాగని వాటిని కలకాలం దాచుకోరు. త్వరత్వరగా పాతవి మార్చి కొత్తవి కొంటుంటారు. అలాంటప్పుడు పాత వస్తువుల్ని తాముండే వీధిలో రోడ్డుకి పక్కన ఉంచుతారు. కావాలనిపిస్తే ఎవరైనా పట్టుకుపోవచ్చు. లేదా పురపాలకసంఘం వాళ్లు పట్టుకుపోతారు. మనకి ఆశ్చర్యంగా అనిపించే ఈ వింత పాశ్చాత్య ఆచారం జర్మనీలోనూ ఉంది.

అలా ఓంప్రకాష్ ఓ పాత టెలివిజన్ తెచ్చుకుని రూంలో పెట్టుకుని వాడుతున్నాడు. అడుగెత్తుండే ఈ పరుపుని కూడా హాస్టల్ వాసులు అలాగే తెచ్చుకున్నారు. ఆ పరుపు యజమాని దాన్ని ఎందుకు బయట పెట్టేసాడో కానీ — అది కొత్తగా, మెత్తగా, హాయిగా ఉంది.

దాస్ ఆ పరుపుమీద పడుకునేవాడు. పగటిపూటా, రాత్రిళ్లు వార్డెన్ చెకింగుకి వచ్చినప్పుడూ – ఆ పరుపుని గదిలో మంచం కిందకి తోసేసేవారు. అదనపు పక్క లేకపోతే, గదిలో ఎందరు మనుషులున్నా వార్డెన్ పట్టించుకోడు. ఒకే మంచంమీద ఒకరికి మించి పడుకోగలరన్నది ఆయనకి నమ్మశక్యంకాని విశేషం.

ఇలాంటి జీవితంలో దాస్‌కి ఏం సంతోషం కలిగిందో, కలుగుతోందో నాకు తెలియదు. తను ఇండియాలో సేల్స్ ఇంజనీరుగా ఉంటూ నెలకి రెండు వేలు తక్కువ కాకుండా సంపాదించేవాడుట. అప్పట్లో అది చాలా పెద్ద జీతం. ఇండియాలో అప్పుడు నా జీతం అందులో సగం కూడా లేదు.

ఆ జీవితాన్ని వదిలి, ఇప్పుడు ఏదో విధంగా జర్మన్ పరీక్ష ప్యాస్ కావాలని తపిస్తున్న అతనిమీద నాకు జాలి కలిగింది. చిత్రమేమిటంటే అతను నా వివరాలడిగి, భార్యాబిడ్డల్ని రప్పించుకునే ప్రయత్నంలో ఉన్నానని తెలిసి, "నీకేమైనా సాయం కావాలనిపిస్తే నేనున్నానని మర్చిపోకు" అని ధైర్యం చెప్పాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments